క్లుప్తంగా

గురుకులం ప్రిన్సిపాల్‌గా కేబీబీ రావు


డాక్టర్ కేబీబీ రావు

నెల్లిమర్ల: మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కేబీబీ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన ఎంజేపీఏపీ గురుకులాల సొసైటీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన శ్రీనివాస్ ఇకపై అధ్యాపకునిగా కొనసాగనున్నారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేడు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి స్టాండింగ్ కమిటీ ప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో నగరంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్‌చేయాలి

శృంగవరపుకోట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు.అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ కొత్తూరు గ్రామంలో బుధవారం నిరసన తెలిపారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి గొల్ల సత్యనారాయణ, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అండేడ్కర్ పేరును వంద మార్లు తలచేకన్నా దేవుడి పేరు జపిస్తే పుణ్యం వస్తుందని పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా మాట్లాడడం సిగ్గుచేటున్నారు. ఇది అంబేడ్కర్‌ను అవమానించడమేనని అన్నారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహారా బాధితుల ధర్నా రేపు

శృంగవరపుకోట: సహారా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 3వ తేదీన పట్టణంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు సహారా బాధితుల సంఘం నిర్వాహక కమిటీ సభ్యులు షేక్ అమానుల్లా ఖాన్, ఎం.సూరిబాబు, కె.ప్రకాశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సహారా కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు సహారా ఖాతాదారులు, ఏజెంట్లు హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సహారా సంస్థ వల్ల నష్టపోయిన డిపాజిట్ దారులు, ఖాతాదారులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. సహారా ఇచ్చిన బాండ్లకు ఏక మొత్తంలో చెల్లింపులు చేయాలని, సీఆర్‌సీఎస్ సహారా రిఫండ్ పోర్టల్ విధానం రద్దు చేయాలని, మరణించిన ఖాతాదారుల వారసులకు పేమెంట్లు చేయాలని కోరారు.


విజయనగరం: విక్రయాలకు సిద్ధంగా ఉంచిన కేక్‌లు


విజయనగరం టౌన్: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బ్రహ్మకుమారీలు


పూసపాటిరేగ: ఎంపీపీ కల్యాణికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రజాప్రతినిధులు

సందడే.. సందడి

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- కళకళలాడిన రాజకీయ నాయకుల ఇళ్లు, అధికారుల కార్యాలయాలు
- కేక్‌లు కోస్తూ సంబరాలు జరుపుకున్న యువత

కాల చక్రం గిర్రున తిరిగింది. చూస్తుండగానే 365 రోజులు కాలగర్భంలో కలిసిపోయాయి. తీపి, చేదుల కలయికతో 2024 సంవత్సరానికి వీడ్కోలు పలికిన జిల్లా ప్రజలు, అదే సమయంలో 2025 నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. దీంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. గడియారంలో ముల్లు 12 గంటలకు పైకి రాగానే చిన్న, పెద్దా తారతమ్యం లేకుండా అంతా రహదారులపై చేరుకుని కేరింతలు కొట్టారు. పలు ప్రాంతాల్లో కేక్‌లు కోసి సందడి చేశారు. మహిళలు, యువతులు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు వేశారు. బేకరీ నిర్వాహకులు, మిఠాయిల దుకాణదారులు ప్రధాన కూడళ్ల వద్ద పెద్దఎత్తున ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి మరీ కేక్‌లు విక్రయించారు. రాజకీయ నాయకులకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోటెత్తడంతో పండగ వాతావరణం నెలకొంది. అలాగే అధికారులకు కూడా సహచర ఉద్యోగులు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్


విజయనగరం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకలు


విజయనగరం: కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది


భోగాపురం: ఎమ్మెల్యే లోకం నాగమాధవికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు


భోగాపురం: భోగాపురంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ సుందర హరీష్


పూసపాటిరేగ: పూసపాటిరేగలో మహిళలు వేసిన రంగవల్లులు


విజయనగరం అర్బన్: కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న మేయర్ విజయలక్ష్మి


విజయనగరం అర్బన్: మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసులు


విజయనగరం రూరల్: మాజీ మంత్రి అశోక్ గజపతికి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రులు, నాయకులు


విజయనగరం రూరల్: జెడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు, నాయకులు


విజయనగరం రూరల్: కోలగట్ల ఇంట నూతన సంవత్సర సందడి


నెల్లిమర్ల రూరల్: సీతారామునిపేట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న రేగాన శ్రీనివాసరావు, తదితరులు


విజయనగరం టౌన్: వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బేతని మిషన్ చర్చి ప్రతినిధులు

కార్మికులకు అన్యాయం చేయవద్దు

నెల్లిమర్ల: జూట్ యాజమాన్యం గోనె కొనుగోలు ఆర్డర్ పేరిట కార్మికులకు అన్యాయం చేయవద్దని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 7నెలలుగా మిల్లు లాకౌట్ చేయడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. . అయితే జూట్ యాజమాన్యం గోనె సంచులు కొనుగోలు ఆర్డర్ కావాలని చెప్పడం భావ్యం కాదన్నారు జూట్ యాజమాన్యం ముడి సరుకు (నార) కొరత పేరిట అక్రమంగా మిల్ లాకౌట్ చేసి గత 7నెలలుగా కార్మికులను ఇబ్బందుల పాలు చేసిందని ప్రస్తుతం గోనె కొనుగోలు ఆర్డర్ తీసుకు రావాలని చెప్పడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే జూట్ యాజమాన్యం కార్మికుల నుంచి అప్పుగా రూ.5,రూ.10,రూ.18 తీసుకుందని ఇంతవరకు చెల్లించలేదు సరికదా రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. 2016 నుంచి రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు చెల్లించకుండా పీఎఫ్, ఈఎస్ఐ ప్రభుత్వం వాటా చెల్లించక పోవడంతో పింఛన్, ఈఎస్ఐ సౌకర్యాలు పొందలేకపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం, కలెక్టర్ వెంటనే స్పందించి జూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని మిల్లు తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో క్షీణిస్తున్న పారిశుధ్యం

- జిల్లా వ్యాప్తంగా అంటురోగాలు, విష జ్వరాలు ప్రబలుతున్న వైనం
- పారిశుధ్య పనులు చేపట్టాలంటున్న ప్రజలు


జొన్నవలసలో మురుగునీటితో నిండిపోయిన కాలువ


కోరుకొండ గ్రామంలో రోడ్డుపై వేసిన చెత్త

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ, జొన్నవలస గ్రామాల్లో పారిశుధ్యం పరిస్థితి దారుణంగా ఉంది. ఎక్కడబడితే అక్కడ చెత్త పేరుకుపోవడం, కాలువల్లో మురుగు నిలిచిపోవడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల అతిసార, డయేరియా ప్రబలి ప్రజలు ఇబ్బంది పడిన దాఖలాలున్నాయి. రెండు నెలల కిందట గుర్ల మండల కేంద్రంలో డయేరియా ప్రబలడంతో వందలాది మంది ప్రజలు ఆస్పత్రుల పాలయ్యారు. అధికార పార్టీ నాయకులతో పాటు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం బాధితులను పరామర్శించారు. అలాగే కొద్ది రోజుల కిందట విజయనగరం మండలం గుంకలాంలో పారిశుధ్యం క్షీణించడంతో చిన్నారులు, పెద్దలు అతిసార బారిన పడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో తమ గ్రామంలో ఎటువంటి అంటురోగాలు ప్రబలుతాయోనని కోరుకొండ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ రహదారిలో రోడ్డుపైనే చెత్తా చెదారం వేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ రహదారికి సమీపంలోనే కొన్ని గృహాలున్నాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి అంటురోగాలు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జొన్నవలసలో ఉపాధి నిధులతో ఇటీవల నిర్మించిన సీసీ డ్రెయిన్ నిండిపోయి దోమలకు నిలయంగా మారింది. కాలువలోని మురుగునీరు సైతం రోడ్డుపైకి చేరుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఎమ్మెల్యే తర్వాత అంతటి స్థాయి ఉన్న నాయకుడని పేరుంది. ఆయన స్వగ్రామంలోనే పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుధ్యం క్షీణిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను ఆదేశిస్తున్నా ఇంకా అలసత్వం వీడడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- సమగ్ర భూ రీసర్వేపై నాడు దుష్ప్రచారం చేసిన కూటమి నేతలు
- తాజాగా సర్వే ప్రారంభించిన కూటమి సర్కార్


చంద్రంపేటలో తాజాగా సర్వే చేస్తున్న సిబ్బంది


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దొంకాడ గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నాడు వద్దన్నారు.. నేడు ముద్దంటున్నారు..!

గంట్యాడ:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేపై ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, టీడీపీ, జనసేన కూటమి నేతలతో పాటు ఎల్లో మీడియా చేసిన దుష్ప్రచారం అంతా ఇంత కాదు. ఈ సర్వేపై రైతుల్లో, ప్రజల్లో అనేక సందేహాలు రేకెత్తించారు. అప్పటిలో ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల బహిరంగ సభల్లో సమగ్రభూరీసర్వేను ఉద్దేశించి...'తమ్ముళ్లా మీభూములను జగన్‌మోహన్‌రెడ్డి లాగేసుకుంటున్నాడు. కూటమిని గెలిపిస్తే భూసర్వేను రద్దు చేస్తాం.. మీభూము లను కాపాడుతాం' అంటూ మైక్ పట్టుకుని ఉన్నవిలేనివీ కల్పించి చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారు. ఎల్లోమీడియా, సోషల్ మీడియాలో ఎడాపెడా కథనాలు ప్రచురించేశారు. ఏ సర్వేను అయితే రద్దు చేస్తామని నాడు చంద్రబాబు, కూటమి నేతలు చెప్పారో అదే సర్వేను నేడు కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించడంతో సర్వత్రా చర్చించుకుంటున్నారు.

> **సర్వే చేపడుతున్నాం..**
> పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని చంద్రంపేటను ఎంపిక చేసి భూసర్వేచేస్తున్నాం. ఇక్కడ సర్వే విజయవంతం అయితే మండలంలోని మిగతా గ్రామాల్లోనూ భూసర్వే చేయిస్తాం.
> – నీలకంఠేశ్వరరెడ్డి, తహసీల్దార్, గంట్యాడ

వందేళ్ల తర్వాత సర్వే

రైతులు ఎన్నో ఏళ్లుగా భూసమస్యలను ఎదుర్కొంటున్నారు. భూమి ఒకరిది అయితే మరొకరి పేరున రికార్డుల్లో నమోదు కావడం, సర్వే నంబర్లల్లో తప్పులు, సరిహద్దుల సమస్య , ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కావడం వంటి అనేక సమస్యలు ఉన్నాయి. తమ భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే వారు. జిల్లా స్థాయిలో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమాల్లోనూ భూ సమస్యలపైనే అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చేవి. రైతులు ఏ అధికారి వద్దకు, ఏ కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేకుండా వారి భూసమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమగ్ర భూరీస ర్వే కు శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో వంద సంవత్సరాల తర్వాత సమగ్రభూరీసర్వేను జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించింది. అంతకుముందు ఏ ప్రభుత్వమూ సమగ్ర భూరీసర్వే చేయాలనే ఆలోచన కూడా చేయలేకపోయింది. సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ,సర్వే, పంచాయ తీరాజ్, మున్సిపల్ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో 2020లో ' వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష ' పథకం పేరుతో రాష్ట్రంలో మొదటి విడత సమగ్ర భూరీసర్వేను గత ప్రభుత్వం ప్రారంభించింది. మూడు దశల్లో 2023 జనవరి నాటికి సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వేలమంది సర్వే బృందాలతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్‌లతో సర్వే చేపట్టారు. గంట్యాడ మండలంలో 45 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 20 గ్రామాల్లో గత ప్రభుత్వంలో భూసర్వే పూర్తయ్యింది. అయితే భూసర్వే పై ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నుంచే టీడీపీ, జనసేన అగ్రనాయక త్వం నుంచి కింది కేడర్ వరకు వారికి జతకడుతూ ఎల్లోమీడియా ఎంత చెడు ప్రచారం చేయాలో అంత చేశాయి. ఒక విధంగా చెప్పాలంటే భూసర్వే అంటే రైతులు భయపడేంతలా విషప్రచారం చేశారు. ఇంతస్థాయిలో వ్యతిరేకించిన వారే ఇప్పుడు ఏపీ భూసర్వే పేరుతో సర్వేను మళ్లీ ప్రారంభించారు. మండలంలోని చంద్రంపేటలో తాజాగా భూరీసర్వే పనులు ప్రారంభమయ్యాయి.

భగవద్గీతపై ప్రచారం

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర, తెన్నుబొడ్డవర, ముషిడిపల్లి, మధుపాడ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక విజయనగరం కమిటీ సభ్యులు బుధవారం ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భగ వద్గీత మన జీవితాలకు మార్గదర్శి అని, ప్రతి హిందువు పఠించాల్సిన, తెలుసుకోవాల్సిన, ఆచరించాల్సిన ఒక ధర్మం అని చెప్పారు. కార్యక్రమంలో శంకరరావు, ప్రసాద్, సి.వి.ఎస్.నాయుడు, వంశీ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత


మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని గరివిడిలోని అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నివారించేందుకు విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. నూతన సంవత్సరంతో మొక్కలు నాటడం వంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆర్.శివ, వివిధ విభాగాధిపతులు,ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.